**Online at:** https://researchtrendsjournal.com
**Indexed Journal**

**ISSN No:** 2584-282X
**Peer Reviewed Journal**




INTERNATIONAL JOURNAL OF TRENDS IN EMERGING RESEARCH AND DEVELOPMENT

**Volume 3; Issue 2; 2025; Page No. 123-124**

**Received: 17-01-2025**
**Accepted: 23-02-2025**

# నైపుణ్యాధారిత కోర్సులు ప్రవేశపెట్టాలి

**డా. బెల్లి యాదయ్య**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నకిరేకల్, నల్లగొండ, తెలంగాణ, భారతదేశం

**DOI:** https://doi.org/10.5281/zenodo.17313620

## Introduction

కాలాన్ని సెకన్లు,నిమిషాలు, గంటల వ్యవధి, పరిమాణం ఆధారంగా రోజులు,వారాలు నెలలు, సంవత్సరాలు, దశాబ్ది,శతాబ్ది,సహస్రాబ్దిగా గణిస్తాం.ఈ భౌతిక రూపంతోపాటు కాలానికి ప్రకృతి వర్తింపజేసే బౌద్ధిక రూపం ఉంది. ఋతువులే కాలానికి బౌద్ధిక రూపం. అయితే, కాలానికి మనుషులు ఆలోచనలు,మేధస్సు, ఆవిష్కరణలతో కల్పించే మరో బౌద్ధిక రూపం ఉంటుంది.దీనికే పరిస్థితులు అని పేరు.ఈ పరిస్థితులను మళ్లీ సామాజిక రాజకీయ ఆర్థిక శాస్త్రసాంకేతిక సాంస్కృతిక రంగాల్లో చోటుచేసుకున్న మార్పులుగా చెప్పుకోవచ్చు.అంటే కాలానికి ఒక భౌతిక రూపం, రెండు బౌద్ధిక రూపాలుంటాయి. బౌద్ధిక రూపంలో రెండోదైన పరిస్థితులనే ఆంత్రోపాలజిస్టులు అసలైన కాలంగా నిర్వచించారు. అభిజ్ఞా ప్రక్రియలు, పర్యావరణ మార్పులతో సంబంధం ఉన్న ఉద్దీపనల మొత్తం ద్వారానే కాలం అవగాహన కాగలదని న్యూరోసైన్సు చెబుతుంది. కాలానికి సామాజిక ప్రాముఖ్యత ఎంతో ఉంది, ఆర్థిక విలువ, వ్యక్తిగత విలువ కాలానికి ఉన్నాయి.ఈ ఎరుక మూలంగానే కాలంతోపాటే అందరూ మారాల్సుందన్నారు పెద్దలు. మారని పక్షంలో ఎక్కడున్న వాళ్లు అట్లనే అక్కడే ఉంటారు. వెనుకబడి పోతరు. వ్యక్తిత్వ వికాస విద్యలో వెనుకబడి పోవడం ఫెయిల్యూర్ కింద లెక్క. కాలంతోపాటు మారుతూ సాగిపోతూ వుండటం గెలుపుదిశగా ప్రయాణిస్తున్నట్టు. వ్యవసాయ యుగపు సంప్రదాయ పరిభాషలో చెప్పాలంటే ఏదైనా వృత్తి చేస్తూ భూములు డబ్బు సంపాదించిన వాళ్లను స్థితిమంతులు, ఐశ్వర్యవంతులు, సంపన్నులు,కలిగినోళ్లు అంటం. ఇప్పుడు స్థితిమంతులు, ఐశ్వర్యవంతులు, సంపన్నులు,కలిగినోళ్లు ఈ మాటలన్నీ వాడుక తప్పాయి. వీటి స్థానంలో సక్సెస్ ఫుల్ పర్సన్స్, విన్నర్స్, విజేతలు అనే మాటలు స్థిరపడ్డాయి. వెనుకట వ్యక్తులు కుటుంబాలు జీవితాన్ని విజయవంతంగా జీవించడానికి కమ్యూనిటీ మద్దతు,సాంప్రదాయ వనరులు జ్ఞానం ప్రతిభ, ఆధ్యాత్మిక విశ్వాసాలు నైతిక స్వభావం వగైరా ఆధారభూతంగా ఉండేవి. ఇప్పుడంతా డిఫరెంట్. నైపుణ్య సముదాయం( స్కిల్ సెట్) ఉంటే జీరోనుంచి మొదలై వ్యక్తులు తాము అనుకున్న రంగాల్లో వంద పాయింట్లకు సమున్నతంగా ఎదగవచ్చు.

ఇది ఆటోమేషన్ యుగం, ఆవిష్కరణల యుగం, వ్యవస్థాపనల యుగం.ప్రపంచం అంతటా ' స్కిల్ ఫస్ట్ హైరింగ్' విధానం నడుస్తోంది. వృత్తి,ఉద్యోగం,వ్యాపారం ఇత్యాది రంగాల్లో విజయం సాధించాలంటే సాంప్రదాయ డిగ్రీ పిజీ సర్టిఫికెట్లు, వాటిల్లోని గ్రేడ్లు ఎంతమాత్రం సరిపోడంలేదు.ఇప్పుడంతా స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్, రివాంప్డ్ కరికులం, ఇండస్ట్రీ అలైన్ మెంట్ వ్యక్తి అభివృద్ధిని సంస్థల అభివృద్ధిని శాసిస్తున్నాయి. ప్రపంచంలో ఏమూలన ఉన్నా నైపుణ్యాలు సముదాయం సరిపడా ఉన్నవాళ్లకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తున్నాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరం -2025 జాబ్స్ రిపోర్ట్ చూస్తే డిగ్రీలకంటే స్కిల్ సెట్ కే మార్కెట్లో డిమాండు ఉందని

అర్థమవుతుంది. మరీ ముఖ్యంగా కృత్రిమ మేధస్సు- మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్టులు, డేటా ఎనలిస్టులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పుష్కలమైన అవకాశాలు న్నాయి. కంపెనీలు సాంప్రదాయ డిగ్రీలను పక్కకు పెట్టి తమకు కావాల్సిన వర్క్ ఫోర్స్ ను నైపుణ్యాధారిత ప్రత్యామ్నాయ కొలమానాలద్వారా నియమించుకుంటు న్నాయి.ఈ మేరకు ఆయా ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలు 'ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాములను, స్కిల్ బేస్డ్ కోర్సులను,అప్ డేటెడ్ అస్సెస్ మెంట్ విధానాన్ని అనుసంధానించుకుంటున్నాయి. అయితే, ఇదే సందర్భంలో కళాశాలలు విద్యార్థుల నుండి అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ఆర్థిక స్తోమత లేని పేద మధ్యతరగతి సాంప్రదాయ కోర్సుల్లో చేరక తప్పనిసరి స్థితి.దీని మూలంగా యువతలో సగానికి పైగా నైపుణ్యలేమితో రోడ్డున పడుతున్నారు.ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2020-21 నివేదిక చెబుతున్న దాని ప్రకారం సాంకేతిక విద్యాలయాలు గత పదేండ్ల క్రిందటితో పోల్చితే ట్యూషన్ ఫీజును 50% పెంచేశాయి. ఇంతా వెచ్చించి సాంకేతిక విద్యలో పట్టభద్రులైనప్పటికినీ నైపుణ్యరాహిత్యంలో యువత వెలవెల పోవడం అకడిమిక్స్ లోపలగల విషాదం.ఎందుకూ కొరగాని

ఉత్త డిగ్రీల వల్ల ప్రయోజనం లేనందున నేటి 'జడ్' జనరేషన్ ఉన్నత విద్యాసంస్థలపై పునరాలోచనలో

ఉన్నారు.కంపెనీలే ప్రత్యేకంగా మైక్రో సర్టిఫికేషన్,బూట్ క్యాంప్స్,షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగుల పని సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. జాతీయ విద్యా విధానం 2020 విద్యార్థికి మిడిల్ స్కూల్ నుండి ప్రారంభించి అన్ని స్థాయిల్లో వృత్తి విద్యను నైపుణ్య శిక్షణను సమగ్రపరచాలని బలంగా సంకల్పించింది.

ప్రభావవంతమైన మౌలిక సదుపాయాలతో పాటు, ప్రత్యామ్నాయ వినూత్న విద్యా కేంద్రాలను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వేగవంతమైన మార్పులు, సాంకేతిక పురోగతి యుగంలో నైపుణ్య ఆధారిత విద్య ఇదివరకటి కంటే ఇప్పుడు మిక్కిలి అవసరమైంది.ఇది యువతకు ఆచరణాత్మక నైపుణ్యాలను అందిస్తుంది, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది, అనుకూలతను పెంపొందిస్తుంది, వ్యక్తిగత వృద్ధిని ప్రోత్సహిస్తుంది, పోటీతత్వాన్ని పెంచి కెరీర్ లో సక్సెస్ సాధించేందుకు చేయూతనిస్తుంది. నైపుణ్య ఆధారిత విద్యను

అభ్యసించడం ద్వారా విద్యార్థులు తమలోని సామర్థ్యాలను పూర్తిగా అన్‌లాక్ చేయవచ్చు,అత్యంత ప్రతిఫలదాయకంగా కెరీర్‌లను కొనసాగించవచ్చు. అభివృద్ధి లక్ష్యంగా తపిస్తున్న ప్రపంచంతో మమేకమై సక్సెస్ లో అనేక మైలురాళ్లను దాటవచ్చు. స్పష్టంగా సూటిగా చెప్పాలంటే స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్ విద్యకు ఉపాధికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది.

ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించి సాంకేతిక పురోగతికి అనుగుణంగా విద్యార్థి మైండ్ సెట్ లో మార్పులు చేస్తుంది. జీవితకాల అభ్యసనాన్ని రూపొందించి

వ్యవస్థాపనల పట్ల ఆవిష్కరణల పట్ల ఆసక్తిని రేకెత్తిస్తుంది.మేధో విస్తృతికి బలమైన పునాది వేస్తుంది. ఎంటర్ ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ టూల్స్ తో శిక్షణ ఇస్తుంది. వ్యక్తిగత వృద్ధికి స్వీయ-సాధికారత ప్రదర్శనకు నైపుణ్యాధారిత విద్య ఇవాళ్టికి విజయవంతమైన నమూనా. అయితే నైపుణ్య ఆధారిత విద్య ఏయే వయస్సు వారికి అనుకూలంగా ఉంటుంది అనే ప్రశ్న మనలో తలెత్తక మానదు.నైపుణ్య ఆధారిత విద్య అన్ని వయసుల వ్యక్తులకు అనుకూలంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.విద్యార్థికైనా, పని చేసుకునే ప్రొఫెషనల్ కైనా లేదా కెరీర్ మార్పు కోరుకునే వ్యక్తికైనా, నైపుణ్య ఆధారిత విద్య కొత్త నైపుణ్యాలను సంపాదించడానికి, ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి, ఆధునిక ప్రపంచంలోని మారుతున్న డిమాండ్లకు అనుగుణంగా మారడానికి విలువైన అవకాశాలను ప్రోది చేస్తుంది. మరీ ముఖ్యంగా ఇప్పుడు ఉద్యోగ మార్కెట్ లో అత్యంత కీలకమైన టాలెంట్ మొబిలిటీని సమకూరుస్తుంది.రాష్ట్ర వ్యాప్తంగా సాంప్రదాయిక కోర్సుల్లో విద్యార్థుల చేరిక గణనీయంగా పడిపోయిన నేపథ్యంలో విశ్వ విద్యాలయాలు పాక్షికంగా కాకుండా పూర్తిస్థాయిలో స్కిల్ బేస్డ్ కోర్సులతో డిగ్రీ విద్యను రీడిజైన్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**Creative Commons (CC) License**
This article is an open access article distributed under the terms and conditions of the Creative Commons Attribution (CC BY 4.0) license. This license permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.